క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఎలుగుబంటి కలకలం



శ్రీశైలం: శ్రీశైలం–దోర్నాల ఘాట్ రోడ్డు మార్గ మధ్యంలో ఉన్న తుమ్మలబైలు సమీపంలో సోమవారం సాయంత్రం రోడ్డుపై ఎలుగుబంటి కనిపించడంతో వాహనదారులు ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేశారు. ఈ విషయం వాహనదారుల్లో ఒకరు వీడియోలు, ఫొటోతీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎలుగుబండి రోడ్డుపై అటు ఇటు తిరిగి, అనంతరం అటవీమార్గంలోకి వెళ్లిపోయినట్లు తెలిసింది.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు: తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ బజార్ పోస్టుమాస్టార్ మోహన్‌రావు కోరారు. మంగళవారం పట్టణంలోని సుబ్బారావుపేటలో నూతనంగా ప్రారంభించిన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కార్యాలయంలో తపాల సేవలు ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ప్రైవేట్ సంస్థలలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సూచించారు. తపాలాశాఖలో పొదుపు చేసుకుని మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కొరకు పునాదులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాల శాఖ సిబ్బంది, ఏజెంట్లు సుధాకర్, అబ్దుల్ రహీం, కృష్ణారెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


విద్యా దీవెనకు సహకార బ్యాంక్‌లో ఖాతాలు

నందికొట్కూరు: జగనన్న విద్యా దీవెన పథకం కోసం కేడీసీసీ బ్యాంక్‌లో విద్యార్థులు తల్లితో కలిసి జాయింట్ ఖాతాను తెరుచుకునే అవకాశం కల్పించినట్లు సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్ కే. సరోజమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సహకార బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఖాతా కోసం బ్యాంక్ చుట్టూ తరిగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంటలోగా ఖాతా తెరువబడునని స్పష్టం చేశారు.

యునాని వైద్య శిబిరానికి విశేష స్పందన

వెలుగోడు: పట్టణంలోని 5వ సచివాలయం సమీపంలో ఏపీ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత యునాని వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 150 మందికి బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, గ్యాస్టిక్, మహిళల సమస్యపై యునాని డాక్టర్ సయ్యద్ మోహిద్దీన్ పీరు, డాక్టర్ నాగరాజు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఇస్మాయిల్, ఏఎన్ఎం, సీహెచ్‌ఓ, గీత తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న డిగ్రీ విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న డంపింగ్‌యార్డ్‌లో నిల్వ చేశారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి వి.నరసింహులు మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను వాడడం వలన పర్యావరణం పాడైపోతుందన్నారు. యాత్రికులు, ప్రజలు రోడ్లకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వలన జంతువులు వాటిని తిని అనారోగ్యం పాలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మదన్‌కుమార్, బీట్ ఆఫీసర్లు జె.ఠాగుర్, టి.సలాం అల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఎన్వీ రమణ బదిలీ



నందికొట్కూరు: పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్వీ రమణ మంగళవారం బదిలీ అయ్యారు. ప్యాపిలి సర్కిల్ పరిధిలో రాచర్ల మండలం ఎస్ఐగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారమని, పట్టణంలో ప్రజలందరూ సంపూర్ణంగా సహకరించడంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వర్తించగలిగానని చెప్పారు.

పేదవాడి ఆనందమే జగనన్న ధ్యేయం

- సంక్షేమ పథకాలతో నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2వేల కోట్లు లబ్ధి
- పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిబాటలో నడవాలి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- పారుమంచాలలో 'పల్లెకు పోదాం'





పారుమంచాలలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్, ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: ప్రతి పేదవాడి కళ్లల్లో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పారుమంచాల సచివాలయం వద్ద సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్యక్షతన ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్–పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆర్థర్ ముందుగా గ్రామానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారుమంచాల గ్రామానికి 33 సంక్షేమ పథకాల కింద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.34,09,26,545ల నిధులను ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 86 సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు సుమారు రూ.2వేల కోట్లు జమ అయ్యాయన్నారు. అర్హత ఉన్న వారందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలిచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని ఆయనను మరోమారు సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, డాక్టర్ యశశ్విని, సర్పంచులు మాధవరం ప్రకాశం, బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివానందరెడ్డి, దేవసహాయం, కరుణాకర్‌రెడ్డి, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మరో మారు జగనన్నను సీఎంగా ఆశీర్వదించండి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు సీఎంగా ఆశీర్వదించాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. పారుమంచాల గ్రామంలో మా నమ్మకం నువ్వేజగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నీలమ్మ, పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ తిరుమలేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎం నాగిరెడ్డి, నానిరెడ్డి (మద్దిలేటిరెడ్డి), బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలోని 3, 4, 5వ వార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. 4వ సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ–నాన్ డీబీటీ కింద రూ.16,47,88,079, అభివృద్ధి పనులకు రూ.4,69,45,945 (మొత్తం రూ.29,81,09,432) ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు జయమ్మ, రేష్మా, లాలు, హమీద్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, జబ్బార్, అబ్దుల్లా, ఆర్ట్‌శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి ఆయువు పట్టు

కొత్తపల్లి: సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి ఆయువు పట్టు అని, మళ్లీ జగనన్న సీఎం కాకపోతే రాష్ట్రంలో సంక్షేమం కుంటుపడుతుందని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయం వద్ద సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీడీఓ మేరీల అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీకి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం రూ.29,76,66,526 ప్రభుత్వం ఖర్చుచేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ మండల కో ఆర్డినేటర్ కె.సుధాకర్ రెడ్డి,



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి


నాయకులు మహమ్మద్ గౌస్, నాగ ఎల్లయ్య, పీ.నాగలక్ష్మీరెడ్డి, పరశురాముడు, ఏసురత్నం, పెరుమాళ్ల శివన్న, బాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో అన్ని వర్గాలకు న్యాయం

పాములపాడు: కులమతాలు, రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని సర్పంచు మారపురెడ్డి లత అన్నారు. మంగళవారం మండలంలోని వాడాల గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి సంబంధించి సంక్షేమ పథకాలు ప్రత్యక్షంగా పరోక్షంగా పొందిన లబ్ధి మొత్తం రూ.15,92,34,490 వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులునాయుడు, సచివాలయసిబ్బంది, గ్రామ వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.



ఓ ఇంటి వద్ద సంక్షేమ పథకాలను వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



వాడాలలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచు

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన

మిడుతూరు: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్ రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని తలముడిపి గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రహత్, సహకార సొసైటీ అధ్యక్షులు నాగతులసి రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలపరిధిలోని శాతనకోట గ్రామంలో సర్పంచ్ జనార్దన్ గౌడు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ కలిమునిసా, మార్కెట్‌యార్డు చైర్మన్ రాహత్, వైస్ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆత్మకూరు: సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వార్డు కౌన్సిలర్లు సుల్తాన్, సుందరరాజు అన్నారు. పట్టణంలోని ఎస్పీజీ పాలెం సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీజీపాలెం సచివాలయం పరిధిలో రూ. 21,81,70,061 సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరాల మాలిక్, సుల్తాన్, మురళి, కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాపనంతపురం గ్రామంలో ..

ఆత్మకూరు మండలంలోని బాపనంతపురం గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు లక్ష్మీరెడ్డిలు మాట్లాడుతూ గ్రామానికి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో రూ.16,65,82,765 లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం గ్రామంలో రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, శివరాం, మోహన్, బాలచంద్రుడుపాల్గొన్నారు.

వెలుగోడు: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు డాక్టర్ నాగేషులు, మహ్మద్ ఖాన్, ఆరీఫ్ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామసచివాలయం – 2 లో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎమ్ఏ రజాక్ వివరించారు. గ్రామవలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జుటూరి మహమ్మద్‌ఖాసీం, భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, గౌస్‌మొహిద్దీన్, కన్నయ్య, పాపారావు, సత్యనారాయణ, నసీమ పాల్గొన్నారు.

మహానంది: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా గ్రామసచివాలయం వద్ద గ్రామానికి అందిన రూ.28,09,76,886 లబ్ధికి సంబంధించి సంక్షేమ బోర్డును ఎంపీడీఓ శివనాగజ్యోతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ పెద్దిస్వరూప, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, ముఖ్య నాయకులు నాగభూపాల్‌రెడ్డి, ఒంటెద్దు వీరారెడ్డి, పగడాల నాగరాజు, శరభారెడ్డి, రేష్మ, పగడాల చంద్రుడు, గోపాల్‌రెడ్డి, మందా గోపాల్, నాగశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

అన్నివర్గాల వారి సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయమని బండిఆత్మకూరు మండల ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. జి.లింగాపురంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు అందిన రూ. 32,96,35,744 సంక్షేమ బోర్డును ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు ముడిమెల పుల్లారెడ్డి, ఎంపీటీసీ అర్జున్, నాయకులు బారెడ్డి ధరణీధర్‌రెడ్డి, సగిలె కృష్ణారెడ్డి, నర్రెద్దుల సుబ్బారెడ్డి, మార్తల నరసింహారెడ్డి పాల్గొన్నారు.




జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్



బాపనంతపురం గ్రామంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ , ఎంపీపీ




వెలుగోడులో జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి



తిమ్మాపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు



సున్నిపెంటలో బ్రోచర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జి.లింగాపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంజీవరెడ్డి

ప్రథమ సామాజిక తత్వవేత్త జ్యోతిరావుపూలే



జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్



ఆత్మకూరులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఆసియమారూఫ్

నందికొట్కూరు: భారత ప్రథమ సామాజిక తత్వవేత జ్యోతిరావుపూలే అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కేజీ రోడ్డుపై జ్యోతిరావుపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. ఆయన మాట్లాడుతూ పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో తోటమాలి కుటుంబంలో జన్మించారని, మానసిక బానిసత్వం నుంచి శూద్రులను కాపాడేందుకు త్రితీయ రత్న అనే నాటకాన్ని రచించిన గొప్ప మహోన్నతుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్‌హుసేన్, ఎస్ఐ ఎన్వీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్లు రాజు, వనజ, బాలస్వామి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి

జూపాడుబంగ్లా: జ్యోతిరావుపూలే వర్ధంతిని పురష్కరించుకొని పారుమంచాల, జూపాడుబంగ్లా గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ కృపాకర్, సర్పంచ్ మొట్టిబాల స్వామి పూలమాలవేసి నివాళ్లు అర్పించుకొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలోని పూలే విగ్రహానికి ఎంపీడీఓ గోపీక్రిష్ణ పూల మాల వేసి నివాళ్లలర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని సంగమేశ్వరసర్కిల్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సభను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, వార్డుకౌన్సిలర్ విజయ చౌదరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, కో ఆప్షన్ సభ్యులు రషీద్, పార్వతి, లక్ష్మీదేవి, బోయరాముడు పాల్గొన్నారు.

వెలుగోడు: చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని జాతీయ బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్ అన్నారు. పట్టణంలోని వేంపెంట రహదారిలో మహాత్మా జ్యోతిరావు పూలే 133 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రఘురాముడు యాదవ్, లిటిల్ ఏంజిల్స్ హైస్కూలు కరస్పాండెంట్ డాక్టర్ ఇమ్మాను యేలు, ఆర్ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగేషులు, ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేషులు, కె.వి.పీఎస్ జిల్లా కార్యదర్శి రాందాస్ మాట్లాడారు.

శ్రీశైలం గోశాలలో పాము



పామును పట్టుకున్న స్నేక్‌రాజ

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలలోని గో ఉత్పత్తుల తయారీ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం 4 అడుగుల రక్తపింజరి పాము కలకలం సృష్టించింది. ఒకటవ నెంబర్ షెడ్‌లో పాము కనిపించడంతో అక్కడి సిబ్బంది పామును పట్టుకోవడంలో నిపుణులైన స్నేక్ రాజును పిలిపించారు. గో ఉత్పత్తులను నిల్వ ఉంచిన సంచుల మధ్యలో దూరిన రక్తపింజరి పామును స్నేక్‌రాజ చాకచక్యంగా పట్టుకొని.. అటవీశాఖ వారికి సమాచారం ఇచ్చారు. పాము చాలా విషపూరితమైనది కావడంతో అటవీ మార్గంలో వదిలేసినట్లు తెలిపారు.

త్వరలో రైతులకు పరిహారం

కొత్తపల్లి: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరలోనే పరిహారం అందిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి – నంద్యాల హైవే 167 కే నిర్మాణంలో 7 గ్రామాలకు చెందిన సుమారు 560 మంది రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణం కోసం 290.33 ఎకరాల భూమిని సేకరించామన్నారు. ఇందులో 231.17 ఎకరాలు రైతులకు చెందిన పట్టాభూమి ఉందన్నారు. కొంత మంది రైతులకు చెందిన భూ రికార్డులు సరిగా లేకపోవడంతో పరిహారం అందించడంలో జాప్యం జరుగుతోందన్నారు.

బీమా సాయం అందజేత

పాములపాడు: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన గంటా ప్రసాద్ ఇటీవల గుండెనొప్పితో మృతి చెందాడు. మృతుని భార్య మహేశ్వరికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.పది వేలను మంగళవారం ఎంపీడీఓ గోపీకృష్ణ, సర్పంచు మల్లీశ్వరరెడ్డితో కలిసి అందజేశారు. మిగతా డబ్బు త్వరలో బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

జూపాడుబంగ్లా: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జంగాలపెద్దన్న మాతృమూర్తి జంబులమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ జూపాడుబంగ్లాకు చేరుకొని జంబులమ్మ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. జంగాలపెద్దన్నను, కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నూర్‌మహ్మద్, లక్ష్మీదేవి గాయపడ్డారు. పాములపాడు నుంచి స్వగ్రామం కంబాలపల్లికి నూర్‌అహ్మద్ టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తాను కూడా వస్తానని అడగడంతో ద్విచక్రవాహనం ఎక్కించుకొని బయల్దేరాడు. గ్రామం వద్ద బండి ఆపగా మహిళ దిగుతుండగా ఆత్మకూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. దీంతో ఇద్దరూ కింద పడ్డారు. లక్ష్మీదేవికి చేయి విరగగా, నూర్‌మహ్మద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మకూరులో ప్రథమ చికిత్స అందిచి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ఢీకొట్టిన వాహనం నిలుపకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.

యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలి

పగిడ్యాల: ఈనెల 30న విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించే మాదిగ, రెల్లీ, డక్కలి యుద్ధభేరి మహాసభను విజయవంతం చేసేందుకు మాదిగలు వేలాదిగా తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పుట్టపోగు విజయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిన్ను కాలనీలో యుద్ధభేరి పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన వాటా కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యుద్ధభేరీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సుందరాజు, రాజేష్, దేవదాసు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను విజయవంతం చేయండి



లోగోను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు: డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బాపనంతపురం గ్రామంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడల లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, శివరాం, రామచంద్రుడు, విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కొత్తపల్లి: ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం నుంచి కనీసం 200 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు, గ్రామవలంటీర్లను ఆదేశించారు. ప్రస్తుతం 77 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

సీపీఎం నాయకులపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మెగా కంపెనీ ఆఫీసులోకి అక్రమంగా ప్రవేశించి, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసిన నలుగురు సీపీఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ మంగళవారం తెలిపారు. చాబోలు గ్రామం వద్ద ఉన్న మెగా కంపెనీ కార్యాలయంలోకి సీపీఎం నాయకులు మండ్ల నాగేశ్వరరావు, చందమాల నాగన్న, పింజరి పక్కీర్‌సాహెబ్, తలారి గోపాలకృష్ణ వారి అనుచరులతో ప్రవేశించి సిబ్బందిని బెదిరించారన్నారు. సిబ్బందిని ఆఫీసు నుంచి బయటకు గెంటి వేసినట్లు కంపెనీ ప్రతినిధి ఎడ్ల మహేంధర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆధార్ కార్డు మార్పు విషయంలో వివాదం

మహానంది: గాజులపల్లె–2 సచివాలయంలో ఆధార్ కార్డు విషయంపై డిజిటల్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, అదే గ్రామానికి చెందిన హరినాథ్‌గౌడు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. హరినాథ్ కుమారుడికి సంబంధించి ఆధార్‌కార్డులో మార్పుల విషయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో సుబ్బరాయుడు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు.

అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడులు

మిడుతూరు: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధిక సాంద్రత పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని దేవనూరు గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి ఆధ్వర్యంలో అధిక సాంద్రత విధానంలో పత్తిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో స్వల్పకాలిక రకమైన రాశి స్విఫ్ట్ పత్తి విత్తనాలు సాలుకు మధ్య దూరం 90 సెం. మీ, మొక్కకు మధ్య దూరం 15 సెం.మీ నాటినట్లు తెలిపారు. ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడులు సాధించినట్లు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త రమణయ్య, కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవి గౌడ్, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, ఏఓలు పీరునాయక్, షేక్షావలి పాల్గొన్నారు.

రూ. 40లక్షలతో టాయిలెట్స్ కాంప్లెక్స్

మహానంది: మహానందీశ్వరస్వామి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో దాతల సహకారం ఎంతో ఉందని మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జిందాల్ సిమెంట్స్ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిందాల్ కంపెనీ వారి ఆధ్వర్యంలో 20 మూత్రశాలలు, 20 మరుగుదొడ్లతో టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, ఏఈ శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామానికి చెందిన మాసుం బీ మంగళవారం సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

చేపలు పట్టుకునేందుకు త్వరలో వేలం

జూపాడుబంగ్లా: పోతులపాడు మజరా గ్రామమైన చాబోలు గ్రామసమీపంలోని రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం తవ్విన కాల్వలో చేపలు పట్టుకునేందుకు త్వరలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, పోతులపాడు సర్పంచ్ పల్లె నిర్మలమ్మ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పోతులపాడు గ్రామపంచాయతీ తీర్మానం మేరకు కాల్వలో చేపలను పట్టుకొనుటకుగాను రూ.76వేలకు వేలం నిమిత్తం ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. వేలం నిర్వహించేవరకూ ఎవరూ కాల్వలో చేపలు పట్టరాదని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో రిజిష్టర్ మత్స్యకార సొసైటీ సంఘాలుంటే వారికి చేపలు పట్టుకొనేందుకు మొదట అవకాశం కల్పించాలని, లేని పక్షంలో వేలం పాటలు నిర్వహించాలని ఉత్తర్వులు ఉన్నాయన్నారు.